

# క రాజు కథలు

## - సింగీతం శ్రీనివాసరావు



### నా మాట

అపుడెపుడో - కాలేజీల కాలం. ఖాసా సుబ్బారావుగారు, గోరా శాస్త్రిగార్ల ప్రోత్సాహంతో భారతి, స్వతంత్రలాంటి పత్రికల్లో కొంతకాలం నా రచనా కేళి సాగింది. ఆనాడు రాసిన "అంత్యఘట్టం" నాటికను ఇప్పుడు కూడా ఆంధ్ర విశ్వవిద్యాలయంలాంటి చోట్ల ప్రదర్శిస్తున్నారంటే అదో తృప్తి. ఆ రోజుల్లోనే టంగుటూరి సూర్యకుమారిగారు నటించి, ప్రదర్శించిన 'చిత్రార్జున' నాటకం పాటలతో సహా రాశాను. ఈ ప్రదర్శనను పండిత జవహర్ లాల్ నెహ్రూగారు ఢిల్లీలో చూశారు. ఆ తర్వాత టామ్ బకన్ అనే స్కాట్లండ్ రచయిత దీనిని ఇంగ్లీషులో తర్జుమా చేస్తే, దీన్ని అమెరికాలో తెలుగు పాటలతో ప్రదర్శించారు. ఈ తర్వాత నేను పెద్దగా రాసిందేది లేదు. "మీ సినిమాలకి మీరే మాటలు రాస్తే బాగుంటుంది" అని జంధ్యాలగారు చాలాసార్లు చెప్పారు. ఆయన మాటల్ని కాదనలేక పుష్పక విమానం తీశాను. "మీరు పాటలు రాయండి" అంటూ వేటూరిగారు ఎప్పుడూ ప్రోత్సహిస్తూ వుండేవారు. 'భైరవద్వీపం'లో ఒకపాట ఆయన రాయాల్సింది. ఎన్నాళ్ళకూ ఆయన దర్శనం లభించకపోయేసరికి గత్యంతరం లేక నేనే "విరిసినది వసంతగానం" పాట రాశాను. ఆ పాట బాగా రాశానని వేటూరిగారు మెచ్చుకోవడం నాకొచ్చిన పెద్ద అవార్డు.

మళ్ళీ ఇన్నాళ్ళకు కాలేజి రోజుల ఉత్సాహం మళ్ళీ పుట్టుకొచ్చింది. ఆ రోజుల్లో పింగళి నాగేంద్రరావుగారు నా చేత స్క్రిప్టు ఒక రఫ్ వర్షన్ సీన్లు రాయించేవారు. వాటిల్లోంచి ఎన్నో ఐడియాలూ, శ్రీకృష్ణార్జునయుద్ధంలో అర్జునుడి పేరు 'అజిభీధఫపావిశ్వేసకి' లాంటివి ఎన్నో వచ్చేవి. ఇంట్లో వాటిని ఫెయిర్ కాపీ చేసే పని నా అర్ధాంగి కల్యాణిది. మళ్ళీ ఆ రోజులు గుర్తొచ్చేలా ఈ కథల్ని కల్యాణే ఫెయిర్ కాపీ చేసింది. ఈ కథల్ని ఆనందిస్తూ - "ఎంజాయ్" చేస్తూ అంటే కరెక్ట్‌గా చెప్పామనిపిస్తుంది - రాశాను. చదివిన వాళ్ళూ ఎంతో కొంత ఎంజాయ్ చేస్తే మరింత ఆనందిస్తాను.

*సింగీతం శ్రీనివాసరావు*

మిత్రులు సింగీతం శ్రీనివాసరావుగారికి నాకూ కనీసం 50 ఏళ్ళ పరిచయం. ఆయన భారతికి 'అంత్యఘట్టం' రాసే రోజుల్లో నేనూ భారతికి రాస్తున్నాను. దరిమిలాను ఆయన సినిమా రంగంలో స్థిరపడిన తర్వాత యిద్దరం కలిసి చాలా సినిమాల్లో పనిచేశాం. ఆయన దర్శకత్వం, వహించిన సినిమాలకు నేను రచన చేశాను. ఆయన దర్శకత్వంలో నేను నటుడిగా పనిచేశాను. ఈ రెండూ చెయ్యకపోయినా ఆయన తీసే అన్ని సినిమాల కథలూ ముందుగా నాకు చెప్పి నాతో చర్చించడం ఒక ఆనవాయితీ. నాకు వారి నాన్నగారు రామచంద్రరావుగారు తెలుసు. ఈ విషయాన్ని ఇంత విపులంగా, ముందు చెప్పడానికి కారణం - ఆయన సెన్సాఫ్ హ్యూమర్‌తో నాకు అయిదు దశాబ్దాల బంధుత్వం ఉన్నదని చెప్పడానికి.

'ఆదిత్య 369'లో నేను, టినూ ఆనంద్, అమ్రేష్‌పురీ నటిస్తున్నాం. మరొకరెవరో గుర్తులేదు. వాళ్ళ చెవులకి వైర్లు బిగించి - భయంకరంగా వయొలిన్లు వాయించే ఏర్పాట్లు చేశారు. ఆ శబ్దాలకి వారి చెవుల్లోంచి రక్తం కారుతుంది. నా చేత ఒక డైలాగ్ చెప్పించారు శ్రీనివాసరావుగారు. నా బాస్ అమ్రేష్‌పురీతో అంటాను. "బాస్, మీరు చాలా గొప్పవారు. వయోలిన్స్ ద్వారా అద్భుతమైన 'వయొలెన్స్'ని సృష్టించగలుగుతున్నారు" అని. ఇది ఎప్పుడు జ్ఞాపకం వచ్చినా గిలిగింతలు పెట్టినట్టు నవ్వుకుంటాను.

శ్రీనివాసరావుగారు రాసిన కథల్ని చదవడం ఇదే మొదటిసారి. చదివాక - మొదట నిర్ఘాంతపోయాను. కారణం మెల్లగా చెబుతాను. అవి చిన్నపిల్లల కథల్లాగ అతి సరళంగా, అమాయకంగా చెయ్యి పట్టుకుని నడిపిస్తున్న పసివాడిలాగా నడిపించుకుపోయాయి. మంచి కథకి అది మొదటి, గొప్ప లక్షణం.

కాగా, మంచి భాష నేర్పేవాడు భాష శాస్త్రికావడం, బాగా పాడేవాడు తాలం బ్రహ్మయ్య, శివ భక్తుడు కాశీ విశ్వేశ్వరయ్య కావడం, దుర్మార్గులు కోరమీసాల కోటయ్య, మిడిగుడ్ల సిద్ధయ్య కావడం - యివన్నీ చిన్నపిల్లల కథలకి ఏమి తికమకలు లేని Stylisation. ఇక్కడితో ఈ కథలకి సంబంధించిన చిన్నపిల్లల ముద్ర ఆగిపోతుంది. చదివించే గొప్ప గుణాన్ని వాక్యాల, పేర్ల సన్నివేశాలతో సాధించారని చెప్పడమే నా ఉద్దేశం. అయితే వీటికి కేవలం చదివించే గుణం మాత్రమే ఉన్నదని సరిపెట్టుకోవడానికి వీలులేదు. లోకధర్మాన్నీ, లోకం తీరునీ, సమాజ స్వరూపాన్నీ అతి సునిశితంగా, కాని సున్నితంగా వెక్కిరించే - అది కేవలం వెక్కిరింత మాత్రమే కాదని అనిపించే సెన్సాఫ్ హ్యూమర్‌ని జతచేశారు. అదీ ఈ కథల్లో రచయిత సాధించినది.

సరళంగా చదివించి, సరసంగా నవ్వించి, 'అమ్మో!' అని తుళ్ళిపడేటట్టు చేసి సమాజంలోని వైపరీత్యానికి కనుబొమ్మలు ముడివేయడమో, కత్తులు నూరడమోకాక, నవ్వుతూ గాటుపెట్టే అందమయిన ఆయుధాన్ని సానబెట్టారు రచయిత ఈ కథల్లో. ఈ ధోరణిలో మార్క్‌ట్వెయిన్, భమిడిపాటి కామేశ్వరరావు వంటి రచయితల్ని స్ఫురణకు తెస్తారు రచయిత. అసలు ఏ రచయితయినా సమాజంలో అవకతవకల్ని చూసి కళ్ళెర్రజేయడం అతని పరిధిని దాటడం అనిపిస్తుంది నాకు. కానీ వ్యగ్రతల్ని చూపి నవ్విస్తూ వాటిని పాఠకుడి స్పృహలోకి తీసుకురావడం రచయిత పరిమితిగా నేను నమ్ముతాను. No Social Problem can be solved by any writer on paper. He can only create the consciousness. హాస్యం ఆ అపశృతిని ఫోకస్‌లోకి తెస్తుంది. ఆలోచించేట్టు చేస్తుంది. అంతవరకే రచయిత పని. తరువాత ఏ పనిని చేపట్టినా అది తనదికాని పనిని నెత్తిన వేసుకోవడమే అవుతుంది.

కొట్టండి చంపండి అనేవాడికంటే, అవినీతిని నవ్వుతూ అలంకరించి, కితకితలు పెట్టే రచయిత మంచి హెచ్చరికని చేయగలుగుతాడని నేను నమ్ముతాను. ఆ పనిని చాలా బాధ్యతగా, గంభీరంగా, ప్రొఫెషనల్‌గా, తనకి వారసత్వంగా వచ్చిన సెన్సాఫ్ హ్యూమర్‌తో ప్రతీ కథలోనూ చేసి చూపించారు.

హాస్యానికి అద్భుతమైన పదును ధ్వని. కేవలం నవ్వించే హాస్యం - వెకిలిగానూ, కొండకచో వెగటుగానూ ఉండవచ్చు. కానీ సమాజశిలాన్ని చిన్న గాటుతో ఉలిక్కిపడేటట్టు చేయడం ఆరోగ్యకరమైన ఉత్తమ హాస్యం లక్షణం. వెకిలి 'ధ్వనుల'ను రాబట్టే చాలామంది రచయితలు మనకున్నారు. అర్థంలేని 'పన్'లను వాడి కంపు కొట్టించే ఘనులున్నారు. నాకు వీరందరి మధ్యా సింగీతం ప్రత్యేకంగా, విభిన్నంగా దర్శనమిస్తారు. ఈ మాట చెప్తున్నప్పుడు నా మనస్సులో మార్క్‌ట్వెయిన్ ఉన్నారు.

ఆయన ఎప్పుడో ఇండియా వచ్చారట. దక్షిణాదిన చాకలి బండమీద బట్టలు ఉతకడం చూశారట. "ఆహా! ఒక్క భారతదేశంలోనే బట్టల్తో బండల్ని బద్దలు కొట్టే విచిత్రాన్ని చూశాను" అన్నారట.

హాస్యానికి వింతకోణం, సంధించగలిగితే వింత పదునూ, సమర్థుడి చేతుల్లో వింత అస్త్రమూ కాగలదు. ఈ పనులన్నీ చేయగల నిష్ణాతుడు సింగీతం శ్రీనివాసరావు. చేసి చూపిన వేదిక - "క రాజు కథలు."

*గొల్లపూడి మారుతీరావు.*

## *రంగుల చెఱువు*

**క రాజు** రాజ్యపు ముఖ్యనగరంలో ఒక చెఱువు ఉంది. అందరూ దాన్ని రాళ్ళ చెఱువు అంటారు. ఎందుకంటే నీళ్ళల్లోంచి చూస్తే కిందున్న రాళ్ళు స్పష్టంగా కనిపిస్తాయి. ఆ నీళ్ళంత శుభ్రంగా, స్వచ్ఛంగా ఉంటాయన్నమాట. ఎన్నో సంవత్సరాలుగా ఆ ప్రాంతంలోని వాళ్ళంతా తాగడానికి ఆ నీళ్ళనే వాడ్తుంటారు. అయితే ఇప్పుడా చెఱువును అందరూ రంగుల చెఱువు అంటారు. దాని వెనుక ఒక ఆసక్తికరమైన కథ ఉంది.

క రాజు రాజ్యంలో ప్రతి ప్రాంతంవారికీ, ప్రతి ఒక్కరికీ న్యాయం జరగాలనేది మంత్రిగారి ఆదర్శం. ఆ విధంగానే జరుగుతున్నదని అతని నమ్మకం కూడా. కానీ కళాకారులకు ఇస్తామన్న పారితోషికాలు ఇంతవరకూ ఇవ్వలేదని, జీతాలు సకాలంలో అందడంలేదని, చేయిస్తామని చెప్పిన సౌకర్యాలెన్నో చేయించలేదని - ఇలా జనమంతా గొణుక్కుంటున్నారుట. ఈ అసంతృప్తికంతా కారణం ఒక్కటే. ఇన్నాళ్ళు ప్రజల అభిప్రాయాలేవీ రాజుగారి చెవులదాకా, అంటే ముందు మంత్రి చెవులదాకా రాకపోవడం. ముమ్మందు ఇలా జరక్కుండా ఉండాలంటే ఒకటే మార్గం. రాజ్యంలో ప్రజాప్రతినిధులను నియమించాలి. వాళ్ళు ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలు తెలుసుకుని రాజుగారికి మంత్రిద్వారా వాటిని తెలియపరుస్తూ ఉంటారు.

ఆలోచన రావాలేగాని దాన్ని ఆచరణలోకి పెట్టేంతవరకు మంత్రికి నిద్రపట్టదు. వెంటనే క రాజును సందర్శించి తన ఉద్దేశాన్ని వెల్లడించాడు. ప్రస్తుతం ముఖ్యనగరానికి ఒక్క ప్రతినిధి ఎన్నికతో ప్రారంభిద్దాం అన్నాడు. "అలాగే మంత్రీ! ప్రజలకు బాగా హితుడైన ఒకరిని ఎంపిక చేసి ప్రజాప్రతినిధిగా నియమించండి" అన్నాడు క రాజు.

"మహారాజా! నాదొక మనవి. ప్రజలకు హితుడెవరో మనం చెప్పడం కన్నా ప్రజలే వారికి సన్నిహితుడెవరో మనకు చెపితే వాళ్ళనే మనం నియమించవచ్చు" అన్నాడు మంత్రి.

"మరి ప్రజాప్రతినిధి అన్నవాడు ఏ మచ్చాలేని సన్మార్గుడుగా ఉండాలిగా? అలాంటి వానిని ప్రజలు ఎన్నుకోవడం సాధ్యమా?" అంటూ సందేహాన్ని వెలిబుచ్చాడు క రాజు.

"అది వారికే సాధ్యం మహారాజా! కాకపోతే కలియుగంలో అసలు తప్పులు చేయనివారుండరు కదా! అందుకని అందరికంటే తక్కువ తప్పులు చేసినవానిని ఎన్నుకొనమని చెప్దాం" అన్నాడు మంత్రి. మంత్రి చెప్పినదానికి సరేనంటూ ఈ పనినెలా చెయ్యాలో మంత్రికే వదిలేశాడు క రాజు. ఈ విషయాన్ని నగరం అంతా చాటించాడు మంత్రి.

ఒక రాజ్యాధికారిని రాజుగారు కాక తమనే ఎన్నుకొనమనేసరికి జనంలో ఇదేదో సరదాగా వింతగా కనిపించింది. కానీ ఈ సరదా వెనక బోలెడంత అవకాశం, లాభం ఉన్నదన్న విషయాన్ని పసిగట్టిన వారు ఇద్దరున్నారు. ఒకరు భూపతిరాజు, మరొకరు శ్రీపతిరాజు.

ఇద్దరూ మేధావులే. ఇద్దరూ విపరీతమైన లోకజ్ఞానం కలవారే. ఇద్దరూ ధనికులే. అన్నిటికంటే ముఖ్యం ఇద్దరికీ ఉత్తములు, సన్మార్గులు అనే పేరుంది. భూపతిరాజు ప్రతి సంవత్సరం ఉగాదినాడు అన్నదానం చేస్తే, శ్రీపతిరాజు సంక్రాంతి రోజు చేస్తాడు. భూపతిరాజు రథోత్సవం చేయిస్తే, శ్రీపతిరాజు తెప్పోత్సవం చేయిస్తాడు. ఊళ్ళోవున్న చిన్నాపెద్దా అందరికీ వీళ్ళతో ఏదో విధమైన లావాదేవీలున్నాయి. అంచేత వాళ్ళిద్దరూ ఎవరికి వారు తాము ప్రజాప్రతినిధులైతే బాగుంటుందని నిశ్చయించుకుని ఇది సాధించడానికి కావలసిన వ్యూహాన్ని ఆలోచించసాగారు. అయితే ఒక చిక్కుంది. వాళ్ళకు సమాజంలో సన్మార్గులనే ముద్ర వుంది కదా! ఇపుడు బాహాటంగా వారి సంకల్పాన్ని తెలియపరిస్తే వీరు స్వార్ధపరులనే చెడ్డపేరొస్తుంది. అందుకని పైకి కనపరచనీయకుండా తామనుకున్న కార్యాన్ని సాధించడానికి యుక్తిగా పన్నాగం పన్నారు.

భూపతిరాజుకు చాలా కావలసినవాడు దానయ్య. దానయ్యకు భూపతిరాజు దేవుడు. అతనెంత చెపితే అంతే. ఈ చనువుతో భూపతిరాజు దానయ్యని పిలిచి తన పథకాన్ని ఉపదేశించాడు. దానయ్య వెంటనే జనంలోకి వెళ్ళి "భూపతిరాజుగారే సరైన ప్రజాప్రతినిధి. సందేహంలేదు కాని ఆయనకి పదవులు ఇష్టంలేదు. అయినా మనందరి శ్రేయస్సు కోసం ఆయన మన ప్రతినిధి అయితే మనకందరికీ మంచిది" అని ప్రచారం చేశాడు. అయితే ఇదే సమయంలో శ్రీపతిరాజుకు నమ్మిన బంటైన శీనయ్య కూడా ఇదే పద్ధతిలో "శ్రీపతిరాజుకిష్టంలేకపోయినా ప్రజల శ్రేయస్సు దృష్ట్యా ఆయనే ప్రజాప్రతినిధి అయితే బాగుంటుంద"ని ప్రచారం చేశాడు.

ప్రజల్లో ఇద్దరూ మంచి పేరున్నవాళ్ళే. పలుకుబడి ఉన్నవాళ్ళే. వీరిలో ఎవరు మిన్న అని నిర్ణయించడం కష్టమైంది. చివరకు ఎవరికివారు ఒక నిర్ణయానికొచ్చారు. ఎవరు ప్రతినిధి అయితే తమకు లాభసాటిగా ఉంటుందో వాళ్ళకే తమ మద్దతు తెలుపుదామని నిశ్చయించుకున్నారు. కాకపోతే తాము సమర్థించిన వ్యక్తికాక ఎదుటి వ్యక్తి ఎన్నుకోబడితే మున్ముందు తమకెలాంటి ముప్పురాగలదో అనే భయం కూడా వాళ్ళకుంది. అలాగని తమకే సంబంధమూ లేదని తలుపేసుకుని ఇంట్లో కూర్చుంటే ఏ లాభమూ ఉండదని కూడా తెలుసు.

వచ్చే పౌర్ణమి రోజు కోటపక్కనున్న మైదానంలో ఎంపిక జరగనుందని ప్రకటించారు. సమయం దగ్గరికొచ్చేకొద్దీ ఉద్రిక్తత ఎక్కువైంది. ప్రచారం ఊపందుకుంది. ఇప్పుడు ఒక నాయకుని మిత్రులు ఎదుటి నాయకుని శత్రువులు. ఎవరికివారు తమ మిత్రత్వాన్ని వాళ్ళ నాయకులకు ఎలా ఋజువు చేసుకోడమా అని తాపత్రయపడసాగారు.

భూపతిరాజుకు మొదటినుంచీ ఆకుపచ్చ రంగంటే ఇష్టం. "మనకు ఆహారం ఇచ్చే పొలాలన్నీ ఇదే రంగుతో ఉంటాయికదా అందుకని" అంటాడాయన. ఇక ఇంట్లోవాళ్ళకి కావాల్సిన బట్టలూ అవి తనకు వదిలిపెడితే ఆకుపచ్చరంగే కొంటాడు. చివరకు తన ఇంటికి కూడా మొత్తం ఆకుపచ్చరంగు పూయించాడు.

ఇది తెలిసిన దానయ్యకు తను భూపతిరాజు పక్షపాతి అని ఘనంగా చాటుకునే పద్ధతి మెరుపులా తట్టింది. అంగట్లో ఒక తట్టెడు ఆకుపచ్చరంగు కొనుక్కుని దానిని నీళ్ళలో కలిపి ముఖంతో సహా ఒళ్ళంతా పూసుకున్నాడు. ఈ రంగుతోనే ఉదయాన్నుంచి సాయంత్రం వరకు ఊళ్ళో తిరగడం మొదలుపెట్టాడు. ఇప్పుడు మాట్లాడకుండానే దానయ్య తను భూపతిరాజు పక్షం వాడని అందరూ ప్రత్యేకంగా చెప్పుకునేట్టు చేశాడు. దీంతో భూపతిరాజుకు దానయ్య మీద ప్రత్యేకమైన అభిమానం ఏర్పడింది.

ఇది చూసిన శీనయ్య నేనేం తక్కువ తిన్నానంటూ శ్రీపతిరాజు ఎక్కువగా ఇష్టపడి ఇంటికి సైతం కొట్టించిన ఎఱ్ఱరంగును ఒంటికి పూసుకుని తిరిగాడు. ఇప్పుడు జనానికి కొత్త విషయం ఒకటి తెలిసి వచ్చింది. తాము మద్దతు యిస్తున్న విషయం నాయకునికి తెలియాలంటే వాళ్ళుకూడా వెంటనే ఆ పక్షానికి చెందిన రంగును పూసుకుని ఊళ్ళో తిరగాలి. రెండురోజుల్లో భూపతిరాజు అనుచరులంతా పచ్చరంగు, శ్రీపతిరాజు అనుచరులంతా ఎఱ్ఱరంగు పూసుకుని వీధులెంబడి అట్టహాసంగా తిరగడం మొదలెట్టారు. నాయకులిద్దరికీ ఇప్పుడు వాళ్ళ పక్షం వారెవరో స్పష్టంగా తెలుస్తోంది. పరిస్థితి చూస్తుంటే ఇద్దరూ సమఉజ్జీలుగా కనిపిస్తున్నారు. ఎవరైనా గెలవవొచ్చు.

ఇది గమనించిన భూపతిరాజుకు ఒక ఆలోచన వచ్చింది. తను గెలవాలంటే శ్రీపతిరాజు ఒక మచ్చవున్నవాడుగా ఋజువు చెయ్యాలి. అంటే అతను ఎప్పుడైనా, ఏదైనా తప్పుచేశాడేమోనని ఆరా తియ్యాలి. అలాంటిది దొరికితే ప్రత్యర్థి ఓటమి తథ్యం.

భూపతిరాజు ఆజ్ఞ మేరకు దానయ్య శ్రీపతిరాజు కల్తీ బంగారం అమ్మిన సొమ్ముతో ఇంతటివాడయ్యాడని. ఈ వార్త ఊళ్ళో ఒక సంచలనం సృష్టించింది. వెంటనే అందరూ చెఱువు దగ్గరకు పరుగుతీసి నీళ్ళల్లో దూకి పాత రంగును కడిగేసుకుని పచ్చరంగు పూసుకుని ఊళ్ళో తయారయ్యారు. ఇప్పుడు శ్రీపతిరాజు పక్షం ఒక్కడూ లేడు.

దీంతో శీనయ్యకు ఆగ్రహం వచ్చింది. కసిగా ఆ క్షణమే భూపతిరాజు స్వంత ఊరుకెళ్ళి అక్కడ నలుగురినీ కనుక్కోగా అసలు భూపతిరాజుకు ఇప్పుడున్నది అసలు భార్యకాదనీ, కట్టుకున్న భార్యను దారుణంగా హింసించి అక్రమంగా ఆవిడ ఆస్తిపాస్తులు లాక్కుని ఇక్కడికొచ్చి కులుకుతున్నాడని తెలిసింది. అంతే ఇది విన్న తక్షణం పచ్చరంగు పూసుకున్న మొత్తం జనం మళ్ళీ చెఱువులో దూకి ఈ రంగును కడిగేసుకుని ఎఱ్ఱరంగును పూసుకున్నారు. ఇప్పుడు భూపతిరాజు పక్షం ఒక్కడూ లేడు.

మళ్ళీ దానయ్య, శీనయ్యలు విడవకుండా ఒకరిమీద ఒకరు పోటీగా ఎదుటి నాయకుల గుట్టులను ఒకటి తర్వాత ఒకటి బయటపెడ్తూంటే ఇన్నాళ్ళూ సన్మార్గులుగా చలామణి అవుతున్న భూపతిరాజు, శ్రీపతిరాజులు నిజానికి ఎన్నోఘోరమైన నేరాలు చేసిన వారుగా బయటపడ్డారు. ఒక్కొక్కసారి వాళ్ళ పాత చరిత్ర బయటపడినప్పుడెల్లా రంగులు పూసుకున్న వాళ్ళంతా ఉదయమనక సాయంత్రమనక చెఱువుకు వెళ్ళి స్నానాలు చేసి రంగులు మార్చి మార్చి చివరకు ఏం చెయ్యాలో దిక్కు తోచకుండా ఉన్నారు.

కానీ దీని పర్యవసానం నగరంలోని వాళ్ళకు వేరే విధంగా తగిలింది. ఇన్నేళ్ళు స్వచ్ఛంగా ఉన్న చెఱువు నీళ్ళు ఇప్పుడు రంగులతో నిండిపోయి బురదలా తయారైంది. ఎప్పుడూ ఈ నీటినే తాగడానికి అలవాటుపడిన ఆ ప్రాంతం వాళ్ళు ఇప్పుడీ రంగునీళ్ళు తాగగానే వ్యాధిగ్రస్తులయ్యారు. ప్రతి ఒక్కరికీ ఒక్కోరకమైన విషజ్వరం అలుముకుంది. వాంతులూ, విరోచనాలతో ఆ నగరప్రాంతమంతా భీభత్సంగా తయారైంది. ఊళ్ళోని వైద్యులంతా ఒక్కుమ్మడిగా వచ్చి బాధితుల్ని ఆదుకుని, మందులిచ్చి వాళ్ళ ప్రాణాలు రక్షించడానికి విశ్వప్రయత్నం చేస్తున్నారు.

చివరకు ఈ ఘోరం సంభవించిన దానికంతా కారణం రంగులు మార్చిన జనం అని తెలియగానే ఆగ్రహంతో అందరూ ఉప్పెనలా పైకిలేచి, కఱ్ఱలు పుచ్చుకుని రంగులు మార్చిన వారి మీదకి దండెత్తారు.

"ఒరేయ్! ఇకనుంచి మీరెవరైనా పచ్చరంగుకాని, ఎఱ్ఱరంగు కాని మరే రంగూ పూసుకుని ఊరేగారో మీ కాళ్ళు విరగ్గొడ్తాం" అని బెదిరించారు. ఈ బెదిరింపుతో నాయకుల అనుచరులంతా భయపడిపోయి ఎన్నికల ప్రక్రియకు తాము రాబోమని ఖచ్చితంగా తెలిపేశారు. మిగతా ఊరి జనం కూడా అదే మాటన్నారు.

అనుకున్నదొకటి అయిందొకటి అనుకుంటూ మంత్రి ఏం చెయ్యాలో తోచక క రాజును కలిసి ఉత్పన్నమైన పరిస్థితిని వివరించి దీనికి పరిష్కారమార్గం చెప్పవలసిందిగా కోరారు.

క రాజు కాసేపు ఆలోచించసాగాడు.

"చూశారా మంత్రీ! అవకాశవాదులు రంగులు మార్చడం వల్ల దేశంలో ఎంతటి అనర్థం సంభవించగలదో? అయినా ఒక విధంగా ఇది మంచికే వచ్చింది. సన్మార్గులనుకున్న ఇద్దరు వ్యక్తుల నిజస్వరుపాలు అందరికీ తెలిసిపోయిందికదా. ఇక ఎటూ జనం ఈ ఎన్నికల్లో పాల్గొనము అన్నారు కనుక ప్రస్తుతానికి దీన్ని రద్దుచేస్తున్నామని ప్రకటించండి. నేరస్తులను పట్టుకునే ప్రతిభ కనబరచిన దానయ్య, శీనయ్యలను నేరపరిశోధనాధికారులుగా నియమించండి. అన్నిటికంటే ముఖ్యం వర్షాలు వచ్చేవరకు ఆ ప్రాంతంలోని ప్రజలకు తాగునీటి వసతి ఏర్పాటు చెయ్యండి" అని ఆజ్ఞాపించాడు క రాజు.

దానయ్య, శీనయ్యలు అనుకోకుండా వచ్చిన ఈ వరంతో ఆనందభరితులయ్యారు. కొత్త ఆదర్శంలో వాళ్ళిద్దరూ ఆప్తమిత్రులయ్యారు. కొన్నాళ్ళకు వర్షాలొచ్చి చెఱువులోకి కొత్తనీళ్ళు రావడంతో మళ్ళీ యథాప్రకారం స్వచ్ఛంగా తయారైంది. ఇప్పుడు నీళ్ళల్లో ఏ రంగూ లేదు. అయినా ఊళ్ళో జనం మాత్రం దానిని రంగుల చెఱువనే పిలుస్తూంటారు.

Post your comments

*(ఈ కథలన్నీ గతంలో హాసం పత్రికలో ప్రచురించబడ్డాయి. అంతర్జాతీయంగా ఉన్న తెలుగువారందరికి చేరాలన్న ఉద్దేశంతో రచయిత ప్రత్యేక అనుమతితో పునర్ముద్రిస్తున్నాము)*

(వచ్చేనెలలో మరోకథ)